సాక్షి కామారెడ్డి

శనివారం । 17 । జూన్ । 2023



పైసలిస్తేనే పని

కామారెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో డబ్బులిస్తేనే ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

- 9లో ▸



'గృహలక్ష్మి'కి ధరాఘాతం

'గృహలక్ష్మి' పథకం కింద రూ. 3 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తున్నప్పటికీ సామగ్రి ధరలు లబ్ధిదారులను భయపెడుతున్నాయి.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.8 /28.7

ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

సదాశివనగర్‌కు ఉత్తమ జీపీ అవార్డు

సదాశివనగర్/కామారెడ్డి క్రైం : మండల కేంద్రానికి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు దక్కింది. మండల కేంద్రంలో చేపట్టిన పల్లెప్రకృతి వనం, అవెన్యూ ప్లాంటేషన్, శానిటేషన్, క్రీడాప్రాంగణం, మంకీ ఫుడ్ కోర్టు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేసినట్లు సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా నుంచి కేవలం ఒకే ఒక మండలాన్ని ఎంపిక చేశారన్నారు. సదాశివనగర్ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ అవార్డుల కార్యక్రమంలో పాల్గొంటారని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంటేష్ ధోత్రే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

బిచ్కుంద : కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార పేర్కొన్నారు. మండలంలోని చిన్న దేవాడ గ్రామంలో శుక్రవారం ఆమె ఘర్ ఘర్ అభియాన్ పేరుతో ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గడపకు కేంద్ర ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయన్నారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజల సొమ్ము బీఆర్ఎస్ పార్టీ ప్రచారం కోసం వాడుకుంటుందన్నారు. బీజేపీలో యువకులు స్వచ్ఛందంగా చేరుతున్నారన్నారు. పార్టీ అధ్యక్షుడు కిష్టారెడ్డి, కార్యకర్తలు పండరి జాదవ్, శ్రీకాంత్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా సాగుతున్న ఎస్సెస్సీ ఇంటర్ పరీక్షలు

కామారెడ్డి టౌన్ : ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు శుక్రవారం 1,086 విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 1,160 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 74 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలా పర్యవేక్షించారు.

ఎస్సెస్సీ సప్లిమెంటరీలో..

పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 208 విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 243 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 35 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. పరీక్షలను డీఈవో ఎస్.రాజు, పరీక్షల నిర్వహణ అధికారి నీలలింగం పర్యవేక్షించారు.

బాన్సువాడ మున్సిపాలిటీకి అవార్డు



బాన్సువాడ : బాన్సువాడ మున్సిపాలిటీకి ఇన్నోవేటివ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అవార్డును శుక్రవారం హైదరాబాద్‌లో ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, కమిషనర్ రమేశ్ అందుకున్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇన్నోవేటివ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ చూపినందుకు బాన్సువాడ మున్సిపాలిటీని ఎంపిక చేసి అవార్డును అందజేశారు. అవార్డుతో పాటు ప్రశాంసాపత్రాన్ని అందుకున్నారు.

రైతుల కోసమే న్యాయ సహాయ కేంద్రాలు



ఎల్లారెడ్డి : రైతు న్యాయ సహాయ కేంద్రాలను ప్రతి రైతు వినియోగించుకోవాలని జిల్లా ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఎస్ఎన్ శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలోని రైతు వేదికలో రైతు న్యాయ సహాయ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ రైతులు భూములు, ఇన్‌పుట్ సబ్సిడీ, మార్కెటింగ్‌కు సంబంధించి ఎలాంటి న్యాయపరమైన సమస్యలున్న రైతు న్యాయ సహాయం కేంద్రాలను సంప్రదించవచ్చన్నారు. రైతులు వారి సమస్యల గురించి కోర్టుల చుట్టు తిరగకుండా రైతు న్యాయ సహాయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు న్యాయమూర్తి తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు వడ్లూర్ ఎల్లారెడ్డి, భిక్కనూర్‌లో ప్రారంభించగా నేడు లక్ష్మాపూర్‌లో ప్రారంభించామన్నారు. త్వరలోనే బిచ్కుంద, బాన్సువాడలో సైతం రైతు న్యాయ సహాయ కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి హారిక, బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీకాంత్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరాస్వామి, డీఎస్పీ శ్రీనివాసులు, సర్పంచ్ రవీందర్‌గౌడ్ తదితరులున్నారు.

జనం మధ్యే లీడర్లు!

- అప్పుడే ఎన్నికల వాతావరణం
- ప్రత్యర్థుల బలం తగ్గించే వ్యూహం
- చోటామోటా లీడర్లకు గాలం వేస్తున్న పార్టీలు
- కామారెడ్డిలో రాజకీయం గరంగరం

ఎన్నికలకు ఇంకా సమయమున్నా కామారెడ్డి నియోజక వర్గంలో మాత్రం రాజకీయం అప్పుడే వేడెక్కింది. ప్రధాన పార్టీల లీడర్లు జనం మధ్యే ఉంటున్నారు. తమ ఎజెండాను ప్రజలకు వివరిస్తున్నారు. ప్రత్యర్థులపై విమర్శలు చేస్తున్నారు. పనిలో పనిగా ప్రత్యర్థి పార్టీల్లోని చోటామోటా లీడర్లకు గాలం వేస్తున్నాయి. వాళ్లను తమవైపు తిప్పుకుని ప్రత్యర్థుల బలాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో కందువాలు కప్పుతున్నట్లు స్పష్టమవుతోంది.



సాక్షి, కామారెడ్డి : జిల్లాలో కీలకమైన కామారెడ్డి నియోజక వర్గంలో ప్రధాన పార్టీల నేతలు జనం మధ్యన తిరుగుతూ వలసలపై దృష్టి సారించారు. ప్రత్యర్థి పార్టీల్లోని నేతలను తమ వైపు తిప్పుకునేందుకు అన్ని పార్టీలు పావులు కదుపుతున్నాయి. ఇక్కడ మూడు ప్రధాన పార్టీల నేతలు వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేందుకు దూకుడుగా వెళ్తున్నారు. అధికార బీఆర్ఎస్ పార్టీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్దన్, కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, బీజేపీ నుంచి జెడ్పీ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి నిత్యం జనం మధ్యే తిరుగుతూ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు.

పట్టుకోసం షబ్బీర్ ఆరాటం..

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడిగా గుర్తింపు ఉన్న మాజీ మంత్రి షబ్బీర్‌అలీకి ఈసారి ఎన్నికలు జీవన్మరణ సమస్యగా చెప్పవచ్చు. వయసు పైబడుతున్న నేపథ్యంలో ఎలాగైనా విజయం సాధించాలన్న పట్టుదలతో ఆయన నిత్యం జనం మధ్యే తిరుగుతున్నారు. సంఘాలు, ఆలయాలకు తనవంతు సాయం అందిస్తున్నారు. గతంలో తన వెంట తిరిగి, ఇతర పార్టీల్లోకి వెళ్లిన నేతలను తిరిగి తనవైపుకు తిప్పుకునేందుకు పావులు కదుపుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు నియోజక వర్గంలోని ఆయా మండలాల్లో ముఖ్యమైన నేతలను పార్టీలో చేర్చుకునేందుకు చర్చలు మొదలుపెట్టారు. ఇప్పటికే పలువురు నేతలు రావడానికి రెడీ అయినట్లు ప్రచారం జరుగుతోంది. కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పలువురు కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో ఎదిగి ఇతర పార్టీల్లో చేరిన వారిని తిరిగి సొంతగూటికి రమ్మంటూ ఆహ్వానం పలుకుతున్నారు. కొందరి ఇళ్లకు షబ్బీర్ అలీ స్వయంగా వెళ్లి రమ్మని కోరినట్లు తెలుస్తోంది. తనదగ్గరకు వస్తే తగిన గుర్తింపు దొరుకుతుందని భరోసా ఇస్తున్నట్లు సమాచారం.

సర్వశక్తులూ ఒడ్డుతున్న కాటిపల్లి..

నియోజకవర్గంలో బీజేపీకి నాయకత్వం వహిస్తున్న జెడ్పీ మాజీ చైర్మన్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఊరూరా తిరుగుతున్నారు. అన్ని చోట్ల క్యాడర్‌ను బలోపేతం చేసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలన్న పట్టుదలతో సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. కుల సంఘాలు, కులదేవతల ఆలయాల నిర్మాణాలకు సొంతంగా డబ్బులు పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే ఆయన ఆలయాల నిర్మాణాలు, పునర్నిర్మాణం, కుల సంఘాల భవనాల నిర్మాణాలకు, కమ్యూనిటీ హాళ్లు, ఫంక్షన్ హాళ్లకు పెద్ద ఎత్తున సొంత డబ్బులు సమకూర్చారు. దీంతో నియోజక వర్గంలోని ఆయా గ్రామాలల్లో కుల సంఘాల ప్రతినిధులు వెళ్లి ఆయనను ఆహ్వానిస్తున్నారు. రైతు సమస్యలు, మహిళా సమస్యలపై పోరాటాలతో జనంలోకి దూసుకెళ్లిన వెంకటరమణారెడ్డి నిరంతరం జనం మధ్యే ఉంటున్నారు. త్వరలోనే ఆయన పాదయాత్రకు కూడా ప్లాన్ చేసుకున్నట్లు తెలుస్తోంది.

అభివృద్ధి ఎజెండాతో గంప..

అధికార పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్దన్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో జనంలో తిరుగుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తోంది. అధికారిక కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఆయన ముందుకు వెళ్తున్నారు. మరోసారి విజయం సాధించాలని గంప గోవర్దన్ ఉవ్విళ్లూరుతున్నారు. ప్రత్యర్థి పార్టీలపై విరుచుకుపడుతూనే, పనిలో పనిగా ఆయా పార్టీల్లో ని పలువురు లీడర్లను తనవైపు తిప్పుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తనకే టిక్కెట్ వస్తుందన్న నమ్మకంతో ఉన్న ఆయన మరోసారి విజయం సాధించి సత్తా చాటాలని ఆరాటపడుతున్నారు. అసంతృప్తితో ఉన్న నేతలను బుజ్జగిస్తూ భవిష్యత్తుపై భరోసా ఇస్తున్నట్టు తెలుస్తోంది. కుల సంఘాలు, ఆలయాల వద్ద కమ్యూనిటీ హాళ్ల కోసం ఇటీవల రూ.10 కోట్లు మంజూరు చేయించి ఆయా సంఘాలకు నిధులు కేటాయిస్తున్నారు. ఈసారి గెలుపొంది రికార్డు సృష్టించాలని ఆయన ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

మరింత అభివృద్ధి చేస్తాం



జిల్లా కేంద్రంలో పట్టణ ప్రగతి దినోత్సవంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గంపగోవర్దన్

- ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్
- ఘనంగా పట్టణ ప్రగతి దినోత్సవం

కామరెడ్డి టౌన్ : కామారెడ్డి పట్టణాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని కళాభారతిలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ విప్ మాట్లాడారు. సీఎం కేసీఆర్, పట్టణాభివృద్ధి మంత్రి కేటీఆర్ సహకారంతో కామారెడ్డి పట్టణాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్తానన్నారు. రూ.214 కోట్లతో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీలో ప్రతిపక్ష వార్డులకు కూడా సమానంగా నిధులిచ్చి అన్ని వార్డులను అభివృద్ధి చేశామన్నారు. నిజాంసాగర్ చౌరస్తా నుంచి దేవి విహార్ వరకు నాలుగు లైన్ల రోడ్లు వేయించినట్లు పేర్కొన్నారు. టేక్రియాల్ చౌరస్తా నుంచి హౌసింగ్ బోర్డ్ వరకు ఆరు లైన్ల రోడ్లు, సెంటర్ లైటింగ్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇందిరా గాంధీ చౌక్, నిజాంసాగర్ చౌరస్తా, జయప్రకాశ్ నారాయణ చౌరస్తా వద్ద జంక్షన్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ చిల్లర రాజకీయాలు మానుకోవాలని, అభివృద్ధిపై దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. జిల్లాను అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ కృషి చేస్తున్నారన్నారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ పట్టణ ప్రగతి ద్వారా కామారెడ్డి పట్టణం రూపురేఖలు మారాయన్నారు. పట్టణంలో పచ్చదనం పెరిగిందన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ నిట్టు జాహ్నవి మాట్లాడుతూ తొమ్మిదేళ్ల పాలనలో మున్సిపాలిటీలో చేపట్టిన ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఐదు కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును స్వయం సహాయక సంఘాల మహిళలకు అందజేశారు. ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను ఇచ్చారు. ఉత్తమ కౌన్సిలర్లు అంజల్‌రెడ్డి, స్వప్నను సన్మానించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందూ ప్రియ, ఏఎంసీ చైర్మన్ పిప్పిరి వెంకటి, వైస్ చైర్మన్ రవియాదవ్, ఆర్డీవో శ్రీనివాస్, కమిషనర్ దేవేందర్, కౌన్సిలర్లు, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నిట్టు వేణుగోపాల్ రావు తదితరులున్నారు.

బ్యాంక్ ఎదుట ఆందోళన

- మేనేజర్ లంచం తీసుకున్నాడని రైతుల ఆరోపణ రుణాల
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు
- లంచమిచ్చిన డబ్బులు తిరిగివ్వాలని డిమాండ్



బ్యాంక్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

లింగంపేట(ఎల్లారెడ్డి) : బ్యాంక్‌లో లంచం తీసుకుంటూ పంట రుణాలు మంజూరు చేస్తున్నారని పేర్కొంటూ పలువురు బాధితులు శుక్రవారం లింగంపేట ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ఎదుట ఆందోళనకు చేశారు. నెలల తరబడి పంట రుణాల కోసం బ్యాంక్ చుట్టూ తిరుగుతున్నా మేనేజర్ ఆర్యరాజ్ పట్టించుకోలేదని బ్రోకర్లను ఆశ్రయిస్తే ఒక్కరోజులోనే క్రాఫ్ లోన్ మంజూరు చేస్తున్నారని వారు వాపోయారు. లోన్‌కోసం మేనేజర్‌ని కలిసే దబాయిస్తున్నాడన్నారు. శుక్రవారం కోమట్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు లింగంపేటకు వచ్చి బ్యాంకు మేనేజర్‌ను నిలదీశారు. దాదాపు నెలరోజుల క్రితం కోమట్‌పల్లికి చెందిన తల్లీకొడుకులు వెల్పుల సాయిలు రూ. 45 వేలు, తల్లి బాల నర్సవ్వ రూ. 80 వేలు రుణం తీసుకోగా వారిద్దరి వద్ద నుంచి రూ. 25 వేలు బ్రోకర్ల చొప్పున లంచం తీసుకున్నట్లు ఆరోపించారు. అలాగే గంపల తిరుపతి, నర్సవ్వ ఒక్కొక్కరు రూ. లక్ష రుణం తీసుకున్నారు. వారి వద్ద నుంచి బ్రోకర్ల ద్వారా రూ. 25 వేలు, వెల్పుల పెద్ద సంగయ్య రూ. 1.18 లక్షల క్రాఫ్‌లోన్ తీసుకోగా ఆయన వద్ద నుంచి రూ. 25 వేలు లంచం తీసుకున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వీరితో పాటు ఒక్క కోమట్‌పల్లి గ్రామంలోనే 15 నుంచి 20 మంది వరకు రుణాలు తీసుకున్నారు. ఇలా మండలంలోని 41 జీపీల్లో వందల సంఖ్యలో క్రాఫ్ లోన్‌లు తీసుకున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకుడిని తీసుకెళ్తే ఒకే రోజులో లోన్ మంజూరు చేస్తున్నట్లు రైతులు వివరించారు. గతవారం సింగిల్ విండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి, లింగంపల్లి(ఖుర్దు) గ్రామపెద్ద గొల్ల కాశీరాం బ్యాంకు మే నేజర్‌కు కలిసి ఇలా లోన్‌ల కోసం రూ. 25వేలు లంచం తీసుకున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారని తెలపగా, తనను ఎక్కడికైనా ట్రాన్స్‌ఫర్ చేయించండని వారినే దబాయించినట్లు తెలిసింది. దీంతో వారు ఆర్డీవోకు, ఆర్ఎంకు ఫోన్‌ద్వారా బ్యాంక్ మేనేజర్‌పై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో కోమట్‌పల్లికి చెందిన 20 మంది శుక్రవారం లింగంపేట బ్యాంకుకు చేరుకొని తామిచ్చిన లంచం డబ్బులు తిరిగివ్వాలని మేనేజర్‌ను నిల దీశారు. బ్యాంకు వద్ద ఆందోళనకు దిగారు. దాంతో మేనేజర్‌ను వివరణ కోరగా తనను అడగొద్దని, లంచం తీసుకున్న వారినే అడగాలని వారిపై మండిపడ్డారు. దీంతో రైతులు స్థానిక పీఎస్‌లో ఎస్సై శంకర్‌కు మేనేజర్ ఆర్యరాజ్‌పై ఫిర్యాదు చేశారు. విచారణ చేస్తామని ఎస్సై తెలిపారు.

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- రూ.655 కోట్లతో బాన్సువాడ అభివృద్ధి
- బాన్సువాడలో పట్టణ ప్రగతి కార్యక్రమంలో స్పీకర్ పోచారం
- పట్టణంలో మహిళల ర్యాలీ, మానహారం



పారిశుధ్య కార్మికులతో కలిసి భోజనం చేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ : రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి బాన్సువాడ పట్టణానికి రూ.655కోట్లతో అభివృద్ధి చేశామని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బాన్సువాడ మినీ స్టేడియంలో పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ 1998లో బాన్సువాడలో 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించామని, అప్పట్లో ఏరియా ఆస్పత్రిలో మెటర్నటీ వార్డు చాలా చిన్నదిగా ఉండేదని, ప్రస్తుతం బాన్సువాడలో రూ.20 కోట్లతో 100 పడకలతో మాతా శిశు సంరక్షణ ఆస్పత్రిని ఏర్పాటు చేశామని అన్నారు. ఈ ఆస్పత్రిలో ప్రతి నెల సుమారు 400 ప్రసవాలు జరుగుతున్నాయని, బ్లాడ్ బ్యాంకును ప్రారంభించామన్నారు. ఒక్కో పేషెంట్‌పై ప్రభుత్వం రూ. 7,600 ఖర్చు చేస్తుందన్నారు. ప్రతిరోజు భోజనానికి ఒక్కొక్కరిపైనా రూ.100 ఖర్చు చేస్తుందని, గర్భిణులకు న్యూట్రిషన్ కిట్‌లను అందజేస్తున్నామని, ఇప్పటివరకు బాన్సువాడలో 25 వేల మందికి కేసీఆర్ కిట్లు ఇచ్చామన్నారు. 1994లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు బాన్సువాడలో ఒకేఒక్క ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండేదని, ప్రస్తుతం 30 ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు, గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామన్నారు. బాన్సువాడ పట్టణంలో రూ.18 కోట్లతో 14 ఎకరాల్లో 214 ప్లాట్లు చేసి ఆటోనగర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు రూ.655 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు స్పీకర్ అన్నారు. రాష్ట్రంలోనే బాన్సువాడ నియోజకవర్గంలో అత్యధికంగా 11 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించామన్నారు. స్థలాలు లేని వారికి స్థలాలిస్తామని, స్థలాలున్నవారికి రూ. 3 లక్షలు ఇస్తామన్నారు. బాన్సువాడ పట్టణంలో త్వరలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేస్తామన్నారు. పారిశుధ్య కార్మికులకు సన్మానించి, వారితో కలిసి భోజనం చేశారు. మహిళలు మున్సిపాలిటీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. తాడ్కోల్ చౌరస్తా వద్ద మానవహారం నిర్మించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అంజిరెడ్డి, నాయకులు ఎజాస్, కృష్ణారెడ్డి, పిట్ల శ్రీధర్, పాత బాలకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, కమిషనర్ రమేశ్ తదితరులున్నారు.

జీతాలు ఇప్పించే బాధ్యత నాది



అవుట్‌సోర్సింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి

- సమ్మె విరమించండి..
- అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా శుక్రవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రొఫెసర్ యాదగిరి విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది వద్దకు వెళ్లారు. వారితో మాట్లాడుతూ రెండు నెలలుగా వర్సిటీలో జరుగుతున్న పరిణామాలతో కొంత అనిశ్చితి ఏర్పడిందన్నారు. వీసీ రవీందర్ గుప్తా నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్న వెంటనే తాను చాంబర్‌కు వెళ్లకుండా ముందుగా బ్యాంకు మేనేజర్‌ను కలిశానన్నారు. గురువారం హైకోర్టు ఉత్తర్వుల మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణకు మాత్రమే ఆర్థిక కార్యకలాపాల నిర్వహణ అధికారం ఉంటుందన్నారు. ఆమె ఆమోదం లేఖ ఇవ్వగానే బ్యాంకుకు సమర్పించి మీ జీతాలు ఇప్పించే బాధ్యత నాదని ఆయన స్పష్టం చేశారు. శనివారం లేదంటే సోమవారం లోగా జీతాలు సిబ్బంది ఖాతాల్లో జమఅవుతాయన్నారు. సమ్మె విరమించాలన్నారు. అయితే జీతాలొచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని సిబ్బంది స్పష్టం చేశారు. వర్సిటీలో అత్యవసర పనులు, విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా కొందరికి మినహాయింపు ఇచ్చి మిగిలిన వారంతా సమ్మెలో ఉంటామని తెలిపారు.

నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యం..

విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడమే తన ముందున్న లక్ష్యమని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి తెలిపారు. రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన విలేకరులతో మా ట్లాడారు. వర్సిటీలో నెలకొన్న అనిశ్చితి పరిస్థితుల వల్ల ఉద్యోగులు, సిబ్బంది జీతాలు నిలిచిపోయాయన్నారు. విద్యార్థులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. డిగ్రీ పరీక్షలను సకాలంలో పూర్తి చేసి వీలైనంత త్వరగా ఫలితాలు వెల్లడిస్తామన్నారు.

రిజిస్ట్రార్ కుర్చీ కథాచిత్రం

- థ్రిల్లర్‌ను తలపించేలా ట్విస్ట్‌లే ట్విస్ట్‌లు
- విజిలెన్స్ దాడులతో దిగొచ్చిన వైస్‌చాన్స్‌లర్ రవీందర్ గుప్తా
- చివరికి పాలక మండలి నియమించిన ప్రొఫెసర్ యాదగిరికి రిజిస్ట్రార్‌గా నియామక ఉత్తర్వులు
- నేడు ఈసీ సమావేశం



తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ 'కుర్చీ' కథా చిత్రం ఒక కొలిక్కి వచ్చింది. గత రెండు నెలలుగా రిజిస్ట్రార్ కుర్చీ చుట్టూ ఉత్కంఠగా సాగిన వివాదం ముగిసింది. వర్సిటీ పాలక మండలి (ఈసీ) ఒకరిని, వైస్ చాన్స్‌లర్ (వీసీ) మరొకరిని రిజిస్ట్రార్ లుగా నియమించడం.. కుర్చీ కోసం జరిగిన వివాదంతో ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీతాలు నిలిచిపోయాయి. దీంతో ప్రభుత్వం వీసీ ప్రొఫెసర్ డి రవీందర్‌గుప్తా తీరుపై కన్నెర్ర చేసింది. వీసీ అవినీతి, అక్రమాలపై ఈసీ చేసిన ఫిర్యాదుతో ప్రభుత్వం వర్సిటీపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులకు దిగింది. జీతాల కోసం అవుట్‌సోర్సింగ్ సిబ్బంది నిరవధిక సమ్మె, భోజనాలు లేక విద్యార్థుల భిక్షాటన అంశాలు రాష్ట్ర వ్యాప్తంగా తెయూ పరువు ప్రతిష్ఠలను బజారున పడేశాయి. ముడుపులు తీసుకుని డెయిలీవైజ్ లేబర్ పేరిట అక్రమ నియామకాలు, అక్రమ పదోన్నతులు చేపట్టడం, ఈసీ నిర్ణయాలను కాదని ఇష్టారాజ్యంగా రిజిస్ట్రార్‌లను మార్చడం తదితర అంశాలపై మీడియాలో వచ్చిన కథనాలు రాష్ట్రంలో సంచలనం సృష్టించాయి. దీంతో వీసీ పై ప్రభుత్వ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేసి రాజీనామా చేసి వెళ్లాలని ఒత్తిడి చేసినట్లు సమాచారం. బుధవారం వీసీ తాను ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించిన ప్రొఫెసర్ కనకయ్యతో కలిసి పరిపాలనా భవనానికి రాగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు కలిసి సుమారు 8 గంటలు ఘెరావ్ చేశారు. వీసీ వల్లే తమ జీతాలు ఆగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతాల కోసం ఈసీ నుంచి నో అబ్జెక్షన్ తీసుకురావాలని లేదంటే ఈసీ నియమించిన యాదగిరికి వీసీ నో అబ్జెక్షన్ ఇవ్వాలని బ్యాంక్ అధికారులు స్పష్టం చేశారు. తనకు సహరించాలని వీసీ ఫోన్ చేసి అడిగినా ఈసీ మెంబర్లు ఎవరూ ప ట్టించుకోలేదు. అటు కనకయ్యకు ఈసీ మెంబర్ల సహకారం లేకపోవడం.. జీతాల పేరుతో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సమ్మె బాట పట్టడం..ఆకలితో పస్తులుంటున్నామని విద్యార్థులు గంటల పాటు ఘెరావ్ చేయడం వీసీ రవీందర్‌ను తీవ్ర ఒత్తిడికి గురి చేసింది. అదే సమయంలో క్యాంపస్‌కు వచ్చిన డెయిలీవైజ్ సిబ్బంది తాము ఇచ్చిన డబ్బులు తిరిగివ్వాలని వీసీ కాళ్లపై బడి వేడుకున్న కథనాలు వైరల్ అయ్యాయి. చివరకు తనపై భౌతికదాడులు జరిగే అవకాశమూ లేకపోలేదని ఆయన భయాందోళనకు గురయ్యారని తెలుస్తోంది. ఇన్ని రోజులు వర్సిటీకి తానే సర్వాధికారినని, ఈసీ మెంబర్లు నామమాత్రమే అని బీరాలు పలికిన వీసీ శుక్రవారం తానే స్వయంగా వారికి ఫోన్లు చేసి ఈసీ తీర్మానం చేసిన ప్రొఫెసర్ యాదగిరిని రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఆర్డర్స్ ఇస్తున్నట్లు తెలిపారు.

ఈసీ సమావేశానికి వీసీ

తెలంగాణ యూనివర్సిటీ 61వ పాలకమండలి సమావేశం శనివారం హైదరాబాద్‌లోని రూసా భవనంలో జరగనుంది. ఏప్రిల్ 19న జరిగిన ఈసీ సమావేశం నుంచి వాకౌట్ చేసిన వీసీ తర్వాత జరిగిన 5 సమావేశాలకు హాజరు కాలేదు. 56వ, 57వ ఈసీ సమావేశాలపై వీసీ మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. జూన్ 15న వీటిన్నింటిని ఒకచోట చేర్చి విచారణ జరిపిన హైకోర్టు ఈ నెల 26న పూర్తి స్థాయి కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అలాగే వర్సిటీ రోజువారీ ఖర్చులు, ఉద్యోగులు, సిబ్బంది వేతనాల చెల్లింపుల అవసరాలకు సంబంధించిన ఆర్థిక కార్యకార్యకలాపాల నిర్వహణ అధికారాన్ని ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి ఇస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గత ఐదు ఈసీ మీటింగ్‌లకు డుమ్మా కొట్టిన వీసీ శనివారం సమావేశానికి హాజరు కావాలని నిర్ణయించుకోవడం గమనార్హం. దీంతో నేటి ఈసీ మీటింగ్‌పై వర్సిటీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

క్లుప్తంగా

నేడు హైకోర్టు జడ్జి రాక


శ్రీసుధా

ఖలీల్‌వాడి: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి శ్రీసుధ శనివారం జిల్లా కోర్టుకు రానున్నారు. హైకోర్టు జడ్జి జిల్లాలోని వివిధ కోర్టులకు చెందిన జడ్జిలతో సమావేశమై న్యాయస్థానాలలో సివిల్, క్రిమినల్ కేసుల వివరాలు, న్యాయ విచారణ తీరుతెన్నులను సమీక్షిస్తున్నారు. వీటిపై ఆమె జడ్జిలకు పలు సూచనలు, సలహాలు ఇస్తారు. అనంతరం న్యాయసేవాసదన్‌లో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'పోస్టల్ బీమా పథకాలపై జరుగనున్న సదస్సులో ముఖ్యఅతిథిగా హాజరవుతారు. తర్వాత సర్టిఫికెట్లను ప్రదానం చేస్తారు.

నేడు యోగా వాక్

నిజామాబాద్‌నాగారం: అంతర్జాతీయ యోగా దినోత్సవం–2023 సందర్భంగా సన్నాహక కార్యక్రమాలలో భాగంగా శనివారం ఉదయం జిల్లాకేంద్రంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో 'యోగా వాక్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా యువజన అధికారిణి బెల్లాల్ శైలి ఒక ప్రకటనలో తెలిపారు. యోగా వాక్ గాంధీచౌక్‌లో ప్రారంభమై కలెక్టర్ గ్రౌండ్‌లో ముగుస్తుందన్నారు. మార్గమధ్యలో యోగా సాధకులు యోగాసన ప్రదర్శనలు ఇస్తారన్నారు. యోగా సాధకులు, యువతీయువకులు, పిల్లలు,పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయలన్నారు.

ఓటరు సర్వేను పక్కాగా చేపట్టాలి



డొంకేశ్వర్(ఆర్మూర్): ఇంటింటి ఓటరు సర్వేను పక్కాగా నిర్వహించాలని డొంకేశ్వర్ తహసీల్దార్ రవీందర్ నాయక్ అన్నారు. బీఎల్వోలు, వీఆర్వోలతో శుక్రవారం ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించారు. ఈనెల 23 నాటికి సర్వేను పూర్తి చేసి తప్పుల్లేని ఓటరు జాబితాను అందజేయాలని సూచించారు. చనిపోయిన ఓటర్లను గుర్తించి తొలగించాలని, 18ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఇందులో ఆర్‌ఐ రాజేశ్వర్, తదితరులున్నారు.

నీట్ పీజీ ఫలితాల్లో పెర్కిట్ వాసికి 91వ ర్యాంకు


రమ్య

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్‌కు చెందిన దోండి జుగ్గె రమ్య నీట్ పీజీ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 91వ ర్యాంకు సాధించింది. పెర్కిట్ గ్రామానికి చెందిన దోండి జుగ్గె రాజ్‌కుమార్, లక్ష్మీ దంపతుల కుమార్తె రమ్య హైదరాబాద్ శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకుంది. అనంతరం హైదరాబాద్ ఉస్మానియా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. గత మార్చి 5న నీట్ పరీక్ష నిర్వహించగా మార్చి 14న విడుదలైన ఫలితాల్లో రమ్య జాతీయ స్థాయిలో 2,386 ర్యాంకు సాధించింది. కాగా గురువారం విడుదలైన రాష్ట్రస్థాయి ఫలితాల్లో రమ్యకు 91వ ర్యాంకు సాధించింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రమ్య మాట్లాడుతూ జనరల్ ఎండీ విద్యను అభ్యసిస్తానని వెల్లడించారు.

ఉద్యమం ఉధృతం చేస్తాం

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేయాలని తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు నిర్ణయించారు. తెయూ ఆర్ట్స్ కళాశాల మినీ సెమినార్ హాల్‌లో శుక్రవారం వారు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రెగ్యులరైజ్ కావడానికి ఎలాంటి కార్యాచరణ చేపట్టాలనే విషయాలపై చర్చించారు. ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేసే వరకు తమ పోరాటం కొనసాగించాలని నిర్ణయించారు.

ప్రమాదకరంగా చెరువు కుంటలు

- నీటి గుంతల్లో పడి పలువురి మృత్యువాత
- మొరం, నల్లమట్టి కోసం అడ్డగోలు తవ్వకాలు
- ఇష్టారాజ్యంగా ఇటుక, మొరం వ్యాపారుల దందా


చెరువుల్లో జేసీబీలతో పెద్ద గుంతలు తవ్వి గుట్టలుగా పోసిన నల్లమట్టి



వల్లభాపూర్ చెరువులో ప్రమాదకరంగా ఉన్న నీటి గుంత.. గుంతలో పడి మృతి చెందిన రాము (ఫైల్)

మాక్లూర్: కొందరు ఇటుక వ్యాపారులు నల్లమట్టి కోసం, మొరం వ్యాపారులు మొరం కోసం చెరువులు, కుంటలను అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. దీంతో చెరువులు, కుంటల్లో ఏర్పడిన గుంతలు మనుషుల ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. గడిచిన 10సంవత్సరాలలో మాక్లూర్ మండలంలోని బోర్గాం(కె), అడవి మామిడిపల్లి, గుత్ప, మదన్‌పల్లి, ఒడ్డెట్‌పల్లి చెరువుల్లో జరిపిన తవ్వకాల వల్ల ఏర్పడిన నీటి గుంతల్లో పలువురు ప్రమాదవశాత్తు మహిళలు, యువకులు పడి మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. అయినా వ్యాపారుల దందా మాత్రం ఆగడం లేదు. తాజాగా గురువారం రాత్రి మండలంలోని వల్లభాపూర్ కుంట చెరువులో తవ్వకాల వల్ల ఏర్పడిన నీటి గుంతలో రాము(15) అనే బాలుడు ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. ఫలితంగా తల్లితండ్రులకు పుత్ర శోకం మిగిలింది. చెరువులోని గుంతలే రాము మృతికి కారణం అని కొందరు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

ఇటీవల ఇటుక వ్యాపారులు చెరువుల్లో పెద్ద గుంతలు తవ్వి మట్టి తీయటాన్ని గ్రామంలోని కొందరు యువకులు వ్యతిరేకించారు. ప్రమాదవశాత్తు తెలియక అందులో పడి మృతి చెందే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ అభ్యంతరం వ్యక్తం చేశారు. కానీ గ్రామంలోని కొందరి ప్రోద్బలంతో ఇటుక వ్యాపారులు యథేచ్ఛగా చెరువుల్లో నుంచి నల్లమట్టిని తీసి ఇటుక కార్ఖానాల వద్ద గుట్టలుగా పోసుకున్నారు. కొందరితో కుమ్మక్కై ఇటుక వ్యాపారులు రైతులకు ఉన్న వనరులను కొల్లగొడుతునే ఉన్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. చెరువులో భారీ జేసీబీల సహాయంతో వందల సంఖ్యలో ట్రాక్టర్లను సమకూర్చుకొని వేలకొద్ది ట్రిప్పుల మట్టి తీయటం వల్ల లోతు పెరిగి చెరువుకు ఉన్న తూములు పైకి తేలుతున్నాయి. అంతే కాకుండా ప్రమాదకరంగా మారుతున్నాయి. అలాగే చెరువు నిండుకుండలా ఉంటే తప్పా రైతుకు తూము ద్వారా నీరు వచ్చే పరిస్థితి లేకుండా పోతుంది. ఈ విషయమై కొందరు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా, ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు ఉంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువుల్లో అడ్డగోలు తవ్వకాలను అరికట్టాలని, అక్రమార్కులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తగిన చర్యలు తీసుకుంటాం



ఇటుక వ్యాపారులు గ్రామాభివృద్ధి కమిటీలతో ఒప్పందం చేసుకొని చెరువులు, కుంటల నుంచి నల్లమట్టిని తరలిస్తున్నారు. ఇది నేను ఇక్కడకు రాకముందు నుంచే కొనసాగుతుంది. ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టే అర్హత గ్రామాభివృద్ధి కమిటీలకు లేదు. ఇటీవల నీటి గుంతలో పడి ఓ బాలుడు మృతి చెందినట్టు తెలిసింది. చెరువులో పెద్ద గుంతలు తవ్వి, మట్టిని తరలించిన వ్యాపారులకు నోటీసులు ఇచ్చి, తగిన చర్యలు తీసుకుంటాం.

–శంకర్, తహసీల్దార్, మాక్లూర్

21న ఒలింపిక్ ర్యాలీ

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ఒలింపిక్స్ సంఘం ఆదేశాల మేరకు 21న ఒలింపిక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడే ఈగ సంజీవరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఒలింపిక్స్ అసోసియేషన్ సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ర్యాలీ ప్రారంభోత్సవానికి అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హాజరుకానున్నట్లు తెలిపారు. అలాగే ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యేలతో పాటు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతులు పాల్గొంటారన్నారు. ర్యాలీలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు, స్థానిక విద్యార్థులు జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఒలింపిక్ రన్‌లో ప్రతిభగల క్రీడాకారులను ఎంపిక చేసి 23న జరగనున్న రాష్ట్ర ఒలింపిక్ ర్యాలీకి పంపనున్నట్లు తెలిపారు. కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, ఒలంపిక్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఈగ సంజీవరెడ్డి

యూనివర్సిటీని ప్రక్షాళన చేయాలి



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని బాసర ట్రిపుల్‌ఐటీ తరహాలో తెలంగాణ యూనివర్సిటీని ప్రక్షాళన చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి బోడ అనిల్ డిమాండ్ చేశారు. తెయూలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వీసీ, ఈసీ రాజకీయాలతో విద్యార్థులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాంపస్‌లో క్యాంటీన్, అంబులెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. వర్సిటీ ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు సంధ్య, ప్రసాద్, సభ్యులు దినేష్, శత్రు, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తకుప్పలో దరఖాస్తులు

- మాక్లూర్ రెవెన్యూ కార్యాలయ సిబ్బంది నిర్వాకం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న దరఖాస్తుదారులు


రెవెన్యూ కార్యాలయంలోని చెత్తకుప్పలో దరఖాస్తులను వెతుక్కుంటున్న పలువురు

మాక్లూర్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బీసీల్లోని కొన్ని కులాల వారికి తొలి విడతగా రూ.1లక్ష ఆర్థికసాయం ఇవ్వడానికి దరఖాస్తులను స్వీకరిస్తోంది. దరఖాస్తుకు కులం, ఆదాయం, ఇతర ధ్రువపత్రాలు అవసరం ఉంది. దీంతో మండలంలోని ఆయా గ్రామాల్లో అర్హత గల కులాలకు చెందిన వారు కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం రెవెన్యూ కార్యాలయంలో క్యూ కడుతున్నారు. కానీ వారి అవసరాన్ని ఆసరగా చేసుకొని సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. సిబ్బంది అడిగినంత ఇవ్వని పక్షంలో వారి దరఖాస్తులను చెత్తకుప్పలో వేస్తున్నట్లు పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి కులం, ఆదాయం సర్టిఫికేట్ల కోసం ఇచ్చిన దరఖాస్తులు శుక్రవారం చెత్తకుప్పలో దర్శనం ఇవ్వటంతో అవక్కాయ్యాడు. ఈవిషయమై సిబ్బందిని నిలదీశాడు. వెంటనే సిబ్బంది అప్రమత్తమై అధికారుల వద్దకు విషయం చేరకుండా జాగ్రతపడి దరఖాస్తుదారుడికి సర్టిఫికేట్లు చేతిలో పెట్టి పంపించినట్టు సమాచారం. ఈ విషయమై తహసీల్దార్ శంకర్‌ను వివరణ కోరగా ఈ విషయమేమి తన దృష్టికి రాలేదన్నారు. సర్వర్ ఇబ్బంది వల్ల దరఖాస్తులన్నీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. చెత్తకుప్పలోకి సర్టిఫికేట్లు చేరే అవకాశమే లేదన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. సంవత్సర క్రితం నాటి దరఖాస్తులను మాత్రం చెత్తకుప్పలో కాకుండా గుంత తవ్వి అందులో పూడ్చి వేస్తామన్నారు. సర్టిఫికేట్ల జారీలో జాప్యం చేయకుండా అందజేస్తామన్నారు. దరఖాస్తుదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

బొట్టుపెట్టి.. ఉంగరాలు తస్కరించి..

- నకిలీ బాబా మాయాజాలం

భిక్కనూరు: విభూది బొట్టును నుదుట పెట్టి చెయ్యికి ఉన్న ఉంగరాలను నకిలీ బాబా తస్కరించిన ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన మెంచు రాజు ఇంటికి ఆయన సోదరుడైన హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న దుర్గప్రసాద్ ఈనెల 15న వచ్చాడు. అదేరోజు సాయంత్రం తిరిగి హైదరాబాద్ వెళ్తున్న దుర్గప్రసాద్‌ను బస్సు ఎక్కించేందుకు రాజు కూడా బస్టాండ్‌కు వచ్చాడు. కొద్దిసేపటి తర్వాత కామారెడ్డి వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న షిఫ్టు కారు వచ్చి ఆగింది. అందులో కాషాయం దుస్తులు ధరించి ఉన్న వ్యక్తి తాను నాగబాబాను అని వీరిద్దరిని పలుకరించాడు. వీరి నుదుట విభూతి బొట్టు పెట్టి బాబాకే లియె దక్షిణ దేవోజీ అంటూ సదరు నకిలీ బాబా అడుగాడు. వెంటనే రాజు, దుర్గప్రసాద్ తమ చేతికి ఉన్న ఒక్కో బంగారు ఉంగారాన్ని బాబాకు ఇచ్చారు. తదుపరి దుర్గప్రసాద్ వేరే కారులో హైదరాబాద్ వెళ్లిపోయాడు. రాజు ఇంటికి వెళ్లి మగతగా ఉందని నిద్రించాడు. కుటుంబీకులు రాత్రి భోజనం చేయాలని రాజును నిద్ర నుంచి లేపగా ఆయన ఇంకా మగతలోనే ఉండడాన్ని గుర్తించారు. కుటుంబీకులు విచారించగా తనకు మత్తుగా ఉందని నకిలీ బాబా విభూతి పెట్టగానే మైకం కమ్మినట్లు అయ్యిందని తెలిపాడు. అన్నదమ్ములం ఇద్దరమూ బంగారు ఉంగారాలను ఇచ్చినట్లు తెలిపాడు. శుక్రవారం రాజు కుటుంబీకులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్ తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం!

బాన్సువాడ రూరల్(బాన్సువాడ): బాన్సువాడ మండలంలోని ఓ గ్రామంలో గురువారం మధ్యాహ్నం పదహారేళ్ల బాలుడు రెండో తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారానికి యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఓ బాలుడు గ్రామానికి ఇటీవల వచ్చి, నివాసం ఉంటున్నాడు. నిత్యం కాలనీలోని పలువురు చిన్నారులకు ఐస్‌క్రీంలు, చాక్లెట్లు కొనిస్తుండేవాడు. ఈక్రమంలో గురువారం మధ్యాహ్నం బాలుడు రెండో తరగతి చదివే ఓ బాలికకు తినే వస్తువులను కొనిచ్చిన తరువాత పంట పొలాల సమీపంలో పొదల చాటుకు తీసుకెళ్లాడు. వివస్త్రను చేసి అత్యాచారానికి పాల్పడుతుండగా, అప్పుడే అటువైపు బహిర్భూమికి వెళ్లిన మహిళలు గుర్తించి విషయాన్ని గ్రామస్తులకు తెలిపారు. అనంతరం బాలిక తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. శుక్రవారం నిందితుడిని రిమాండుకు తరలించినట్లు తెలిసింది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని 8 గేదెలు మృత్యువాత


మృతిచెందిన గేదెలు

నారాయణఖేడ్: నిజాంపేట్ మండల కేంద్రంలోని జాతీయరహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని 8 పాడిగేదెలు మృతి చెందాయి. నారాయణఖేడ్ ఎస్‌ఐ ఏడుకొండలు, బాధిత రైతులు తెలిపిన వివరాలు ఇలా.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం రుద్రారం గ్రామానికి చెందిన పలువురు రైతులు వేసవికాలం కావడంతో మేత, తాగునీటి కొరత కారణంగా వారి గేదెలను నిజాంసాగర్ ప్రాజెక్టు వెనుక గల పరివాహక ప్రాంతమైన కల్హేర్, నిజాంపేట్ మండలాల శివార్లలో మేపేందుకు పంపారు. శుక్రవారం తెల్లవారుజామున ఐదుగురు రైతులకు సంబంధించిన 8 గేదెలు తప్పించుకొని నిజాంపేట్ మండల కేంద్రంలోని జాతీయరహదారిపైకి వచ్చాయి. దీంతో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అవి రోడ్డుపై చెల్లాచెదురుగా పడి మృతిచెందాయి. మృతిచెందిన గేదెల విలువ సుమారు రూ.6లక్షల వరకు ఉంటుంది. బాధిత రైతుల్లో ఒకరైన కుర్మ రాములు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇందల్వాయిలో దొంగల బీభత్సం

- మూడు ఇళ్లల్లో చోరీ


దొంగలు ధ్వంసం చేసిన బీరువా

ఇందల్వాయి: ఇందల్వాయి గ్రామంలో దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామంలోని రామాలయం వీధిలో ఉన్న మూడు ఇళ్లల్లో శుక్రవారం వేకువజామున గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. రామాలయం వీధిలో ఉంటున్న బోగం లక్ష్మి, జక్కుల రచన, బోగం బాలమణి రాత్రి ఇంటికి తాళాలు వేసి ఎప్పటిలాగే టెరస్‌పై నిద్రించారు. ఇదే అదునుగా దుండగులు వారి ఇళ్ల తాళాలను పగులగొట్టి, ఇంట్లోకి చొరబడ్డారు. జక్కుల లక్ష్మి ఇంట్లోని బీరువాను ధ్వంసం చేసి తులంన్నర బంగారు ఆభరణాలు, మూడు జతల వెండి పట్టగొలుసులు, రూ.55 వేల నగదు అపహరించారు. బోగం లక్ష్మి ఇంట్లో నుంచి అరతులం బంగారు కమ్మలు, బంగారు చైను, ఉంగరం, ముక్కుపోగు, వెండి బ్రాస్‌లేట్, కడియాలు, రూ. 50వేల నగదు చోరీ చేశారు. అనంతరం బోగం బాలమణి ఇంట్లో నుంచి రూ. 20వేల నగదును ఎత్తుకెళ్లారు. ఉదయం లేచిన బాధితులు చోరీ జరిగినట్లు గ్రహించి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై నరేష్ క్లూస్ టీంతో వచ్చి వివరాలు, ఇతర ఆధారాలు సేకరించారు. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలోంచి గొలుసు చోరీ


కామారెడ్డి క్రైం: నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలోంచి మూడు తులాల బంగారం గొలుసు చోరీ చేసిన ఘటన కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామంలో శుక్రవారం వేకువజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన జిల్లాల రాజవ్వ దంపతులు ఇంటి సెల్లార్‌లో పడుకున్నారు. పైఅంతస్తులో మిగితా కుటుంబ సభ్యులు నిద్రించారు. శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో గుర్తుతెలియని ఇద్దరు దుండగులు సెల్లార్‌లోకి ప్రవేశించి నిద్రలో ఉన్న రాజవ్వ మెడలో నుంచి గొలుసు లాక్కున్నారు. మెలకువ వచ్చి ఆమె కేకలు వేయడంతో వారు పరారయ్యారు. బాధితులు దేవునిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరుపుతున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

చెట్టు పడి కూలిన ఇల్లు



ఇందల్వాయి: మండలంలోని మేఘ్యానాయక్ తండాలో శుక్రవారం బలంగా వీచిన ఈదురు గాలులకు రమేష్ నాయక్‌కి చెందిన ఇంటిపై చెట్టు పడిపోయింది. దీంతో ఇల్లు పూర్తిగా కూలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ప్రభుత్వం తమని ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

వృద్ధురాలి అదృశ్యం


కంజర్ల లక్ష్మి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని ముదక్‌పల్లి గ్రామానికి చెందిన కంజర్ల లక్ష్మి (72) అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో మహేష్ శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ 20న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన లక్ష్మి ఇప్పటికీ తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె మేనల్లుడు గోదారి బలరాం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో పలువురు మృత్యువాత చెందారు. ఓ ఎలక్ట్రీషియన్ విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా కరెంట్‌షాక్‌తో మృతిచెందాడు. అలాగే ఓ వ్యక్తి బైక్‌పై వెళుతుండగా టాటా ఏస్ గూడ్స్ వాహనం ఢీకొని మృతిచెందగా.. గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మరణించాడు


రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన బైక్

బోధన్‌రూరల్(బోధన్): సాలూర మండలంలోని కుమ్మన్ గ్రామంలో ప్రయివేటు ఎలక్ట్రీషియన్ ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌తో మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్‌ఐ సందీప్ శుక్రవారం తెలిపారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన దొడ్ల గోపాల్‌రెడ్డి(62) ప్రయివేటు ఎలక్ట్రీషియన్‌గా జీవనం సాగించేవాడు. గురువారం రాత్రి కుమ్మన్‌పల్లి గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో కరెంట్ సమస్య రావడంతో గోపాల్‌రెడ్డిని పిలిచారు. దీంతో గోపాల్‌రెడ్డి సదరు వ్యక్తి ఇంట్లో కరెంట్ చెక్ చేసి, వీధిలోని కరెంట్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదశాత్తు కరెంట్ షాక్ కొట్టింది. దీంతో అతడు కిందకి పడిపోయి, అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఎల్లమ్మతండా శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఎస్సై శంకర్ తెలిపిన వివరాలు ఇలా.. నందివాడకు చెందిన బిరాధార్ శంకర్(44) పానీపూరి విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. శంకర్ ఈనెల 9న శుభకార్యం నిమిత్తం బీదర్‌కు వెళ్లాడు. శుక్రవారం తన కొడుకు నాగరాజుతో కలిసి బైక్‌పై స్వగ్రామం నందివాడకు బయలుదేరాడు. లింగంపేట మండలం ఎల్లమ్మ తండా శివారులో అతడి బైక్‌ను ఎదురుగా వస్తున్న టాటా ఏస్ గూడ్స్ వాహనం అజాగ్రత్తగా వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈప్రమాదంలో తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని అంబులెన్స్‌లో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శంకర్ మృతిచెందాడు. మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. టాటా ఏస్ డ్రైవర్ విలాస్ చాలుర్కర్ రమేశ్ అదిలాబాదుకు చెందినవాడిగా పోలీసులు గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు..

కామారెడ్డి క్రైం: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శుక్రవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని జాతీయ రహదారి బైపాస్‌పై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. సిరిసిల్లా రోడ్డు బైపాస్ పక్కన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. మృతుడిని నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కులాస్‌పూర్ గ్రామానికి చెందిన అడ్డి గంగారాం (75)గా గుర్తించారు. అతడు గత సోమవారం నుంచి కనిపించడం లేదని ఆయన కుటుంబీకులు వెతుకుతున్నట్లు తెలిసింది. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతడు మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించి, అతని వద్ద దొరికిన వివరాల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేశామని ఎస్‌హెచ్‌ఓ నరేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

రెంజల్(బోధన్): ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడు చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని వీరన్నగుట్ట గ్రామానికి చెందిన సుమేర్(22)కు ఏడాది క్రితం వివాహం జరిగింది. సుమేర్ లారీ డ్రైవర్‌గా పని చేస్తూ, మద్యానికి బానిసై ఇంటిని పట్టించుకునేవాడు కాదు. దీంతో ఇంట్లో తరచు గొడవలు జరిగేవి. ఈక్రమంలో గురువారం రాత్రి జీవితంపై విరక్తి చెందిన సుమేర్ పక్కింట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అతడి తమ్ముడు కొన ఊపిరితో ఉన్న సుమేర్‌ను నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య రిహానాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న వివరించారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

బాన్సువాడ: మండలంలోని కృష్ణానగర్ తండా సమీపంలోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేయగా జక్కల్‌దాని తండా, బాన్సువాడకు చెందిన ఏడుగురిని అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.32,270వేలు, నాలుగు బైక్‌లు, 8సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

దోమకొండ: మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలుశిక్ష, రూ.200 జరిమానా విధించారని ఎస్సై సుధాకర్ శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్‌లో అంచనూరు గ్రామానికి చెందిన దేవయ్య, మెదక్ జిల్లా రామాయంపేట మండలం నస్కల్ గ్రామానికి చెందిన ముత్తయ్య డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డారు. వీరిని కోర్టులో హాజరు పర్చగా, జడ్జి ఇద్దరికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు.

ఇద్దరి రిమాండ్

సిరికొండ: మండల కేంద్రంలో పూరి గుడిసెకు నిప్పు పెట్టిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్సై నర్సింలు శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన బండి చంద్రయ్యకు చెందిన గుడిసెకు నిప్పు పెట్టిన కేసులో నిందితులైన బండి మహేష్, సల్ల పద్మలను అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. రహమాన్, జమాల్ అనే వ్యక్తులు పెద్దవాల్గోట్ గ్రామంలో మసీదు పక్కన ఒక ఇంటిని అద్దెకు తీసుకొని రేషన్ బియ్యం నిల్వ చేస్తున్నారని ఎస్సై తెలిపారు. రేషన్ బియ్యంను అక్రమంగా తరలించడానికి వ్యానులో ఎక్కిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. 9.10 క్వింటాళ్ల బియ్యంను ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రవికి అప్పగించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఫిర్యాదు మేరకు రహమాన్, జమాల్‌తో పాటు వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి వ్యానును సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. జమాల్ దొరకగా రహమాన్‌తో పాటు డ్రైవర్ పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.